


అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 240 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 10-6-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




## మహిళల రాజ్యమిది

- ప్రభుత్వ సరఫరా వ్యవస్థలన్నీ ఆడబిడ్డల చేతికే!- మహిళకు తొలి అవకాశం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే - మహిళా శక్తి సభలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు - 553 బస్సులు మహిళా సంఘాలకు అందజేత

**హైదరాబాద్, జూన్ 9 (వన్‌నేషన్):** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేంత వరకు తమ ప్రభుత్వం విశ్రమించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మహిళలు ఏది కోరుకున్నా నెరవేర్చడానికి సోదరుడిగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతీ లోక్‌సభ నియోజకవర్గానికి వస్తానని, మహిళలంతా తమకు అనువైన వ్యాపార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సరఫరా వ్యవస్థ మొత్తాన్ని మహిళలకు అప్పగిస్తామని ప్రకటించారు. వాటిల్లో పాగా వేసిన దళారులు, కమీషన్ ఏజెంట్లు, తెలంగాణ వ్యతిరేక శక్తులను ఏరివేస్తామని చెప్పారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు అప్పగింత సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం మహిళాశక్తి సభ నిర్వహించారు. మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి



వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. భారీ వర్షం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, ఎవరెన్ని అడ్డు పుల్లలు వేసినా ఇప్పటి వరకు స్వశక్తి సంఘాలకు 61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ ఇచ్చామని చెప్పారు. మహిళల రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ పథకం అమల్లో భాగంగా రూ.2 వేల కోట్లు వడ్డీ కింద ప్రభుత్వం చెల్లించిందన్నారు. జీరో వడ్డీ రుణ పరిమితిని

3లో



## యూనిట్ రూ.1.50 కే!

- ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు! - ఆక్వా, నాన్ ఆక్వాగా విభజన - నాన్ ఆక్వాజోన్‌లో యూనిట్ ధర 3.85 - 30 వేల కరెంటు బిల్లు 80-90 వేలకు చేరిన వైనం - సీఎం తాజా నిర్ణయంతో రైతులకు ఉపశమనం

**కైకలూరు, జూన్ 9 (వన్‌నేషన్):** కష్టకాలంలో ఉన్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. అధికారంలోకి వస్తే ఆక్వా రంగానికి జోన్‌తో నిమిత్తం లేకుండా యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తామన్న హామీ అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. రైతులందరికీ దీనిని అమలు చేస్తారు. ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీకానున్నాయి. దీనివల్ల ప్రభుత్వంపై రూ.1100 కోట్ల భారం పడనుంది. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకునేందుకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందించింది. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం దీనిని తుంగలో తొక్కింది. ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విడదీసి పది ఎకరాలలోపు ఉన్న రైతులకు మాత్రమే సబ్సిడీ వర్తించేలా చేసింది. నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న రైతులు యూనిట్‌కు రూ.3.85 చెల్లించాల్సి వచ్చేది. రూ.30 వేలు వచ్చే కరెంటు బిల్లు.. రూ.80-.90 వేలకు చేరింది. ఉచితంగా ఇచ్చే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం గత ప్రభుత్వం ఎత్తివేసింది. తాజాగా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇప్పటికే అనేక రకాలుగా ఆక్వా రంగం

2లో



## పుష్కర ప్రధాని

- నెహ్రూ 12 ఏళ్ల రికార్డును అధిగమించిన మోదీ

**న్యూఢిల్లీ, జూన్ 9 (వన్‌నేషన్):** నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తవుతున్నాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరపున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా (పదేళ్లు) పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. 2014 మే 26న ప్రధాని పగ్గాలు చేపట్టిన ఆయన.. బుధవారంతో ఆ పదవిలో నిరాటంకంగా 4,399 రోజులు పూర్తిచేసుకోనున్నారు. తద్వారా దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకోనున్నారు.

### ప్రధాని ఆధ్వర్యంలో నేడు ఎన్‌డీఏ భేటీ

కేంద్రంలో తన సారథ్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి 12 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం ఎన్‌డీఏ కీలక సమావేశం జరుగనుంది. 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు దీనికి హాజరు కానున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాలు, భారత ఆర్థిక వ్యవస్థ, చమురు, వంటగ్యాస్ ధరలు, కేంద్రప్రభుత్వ వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌పై

4లో



## హైస్పీడ్ రైలు.. కోకాపేటలో స్టేషన్!


- శంషాబాద్, వికారాబాద్‌లోనూ ఏర్పాటు -
హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు డీపీఆర్‌కు ఆమోదం

**హైదరాబాద్, జూన్ 9 (వన్‌నేషన్):** హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం లభించింది. రాష్ట్రంలో కోకాపేట, శంషాబాద్ విమానాశ్రయం, వికారాబాద్‌లో స్టేషన్లు నిర్మించాలని అందులో ప్రతిపాదించినట్లు తెలిసింది. ఆ తర్వాత కర్ణాటకలో ఒకటి, మహారాష్ట్రలో తొమ్మిది స్టేషన్లు కలిపి.. మూడు రాష్ట్రాల్లో మొత్తం 13 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి పుణె వరకు మాత్రమే హై స్పీడ్ రైలు ప్రాజెక్టును ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఇటీవలి బడ్జెట్‌లో హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై, హైదరాబాద్-పుణె హై స్పీడ్ రైలు ప్రాజెక్టులు చేపడతామని పేర్కొంది. ఈ మూడు హైస్పీడ్ ప్రాజెక్టులకు కలిపి శంషాబాద్‌లో భారీ స్టేషన్ నిర్మించాలని ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు అనువైన భూమిని సైతం ఇప్పటికే గుర్తించింది.

అయితే, పుణె నుంచి ముంబైకి ఇప్పటికే హైస్పీడ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున.. మొత్తంగా దీన్ని హైదరాబాద్-ముంబై హై స్పీడ్ రైలు కారిడార్‌గా పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆమోదించిన డీపీఆర్‌లో కోకాపేట స్టేషన్‌ను అదనంగా చేర్చినట్లు తెలిసింది. హైదరాబాద్-ముంబై హై స్పీడ్ రైలు మొత్తం 761 కిలోమీటర్లు ప్రయాణించనుంది.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.
9948222240



# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**- జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె. జి. బాలకృష్ణన్ కు వినతి పత్రం సమర్పించిన తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు- బిషప్ దుర్గం ప్రభాకర్**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 9 (వన్ నేషన్):** న్యూఢిల్లీ డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (SC) హోదా కల్పించాలని కోరుతూ భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె. జి.బాలకృష్ణన్ కు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు బి. ఆర్. యస్ క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ న్యూ ఢిల్లీ లో డా. బి. ఆర్.అంబేద్కర్ భవన్ లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులు మతం మారినప్పటికీ వారి సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోలేదని, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం వారికి కూడా అందేలా ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివక్ష, అవకాశాల కొరత, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాను అని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం ద్వారా వారికి విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలలో సమాన అవకాశాలు లభిస్తాయని, ఇది సామాజిక న్యాయం సాధనలో కీలక అడుగుగా నిలుస్తుందని ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునే విధంగా చొర్వ చూపాలని వారనీ కోరాము అన్నారు

# బడిబాటలో 20శాతం అదనపు నమోదు సాధించాలి

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూన్ 9 (వన్ నేషన్) :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు కీలక అంశాలపై చర్చించారు.

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల నమోదును కనీసం 20 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో జీరో ఎన్రోల్మెంట్ విద్యార్థులు లేని కారణంగా మూతపడిన పాఠశాలలను గుర్తించి, ఈ విద్యా సంవత్సరం నుండి వాటిని పునఃప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన 91 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్లను, ఆయాలను త్వరితగతిన నియమించాలన్నారు. విస్తృత ప్రచారం నిర్వహించి ఈ కేంద్రాలలో చిన్నారులను పెద్ద సంఖ్యలో చేర్పించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ర్యాంపులు, వెస్ట్రన్ టాయిలెట్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఇప్పటికే మంజూరైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్లు, కంప్యూటర్లు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని, ఇంటర్నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి, డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రాధాన్యత అని అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి బడిబాటను విజయవంతం చేయాలని కోరారు.ఈ వెబెక్స్ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, రేణుక దేవి, పూలన్, వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు

# ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ: సీఎం చంద్రబాబు

(1వ పేజీ తరువాయి)

ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ఓ వైపు మేతల ధరలు పెరగడం, మరోవైపు నాణ్యమైన సీడ్ దొరక్కపోవడం.. కొంటు దశకు చేరుకున్న రొయ్యల ధరల పతనం ..ఇలాంటి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల విజయవాడలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ఫిషరీస్ కమిషనర్ రాంశంకర్ నాయక్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్.. రైతు సంఘాలు, రైతులు, మేతల కంపెనీల యజమానులతో సమావేశం నిర్వహించారు. సబ్సిడీపై యూనిట్ విద్యుత్ రూ. 1.50కు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ సందర్భంగా ఆమోదం తెలిపింది. ఆక్వా, నాన్ ఆక్వా జోన్ పరిధి లేకుండా ఆక్వా రంగం మొత్తాన్నీ ఆక్వా జోన్‌లోకి తీసుకుని 12 వేల అదనపు కనెక్షన్లకు కూడా రూ. 1.50కే యూనిట్ విద్యుత్‌ను అందించాలని నిర్ణయించారు. రెండ్రోజుల క్రితమే సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 2 లక్షల మంది రైతులకు రూ.కోట్లలో ఖర్చు తగ్గుతుందని అంటున్నారు. ఇప్పటికే నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు గ్రామాల్లో ప్రభుత్వం నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నారు. అవి పూర్తయితే మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వీలవుతుంది. కైకలూరు మండలం గోపవరంలో 220/33 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.32 కోట్లతో నిర్మిస్తున్నారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తయి విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

### విద్యుత్ సబ్సిడీ రైతులకు సంజీవని..

యూనిట్ రూ. 1.50కే ఆక్వారంగానికి సబ్సిడీపై విద్యుత్ అందించడం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతుల పాలిట సంజీవనిలా పనిచేస్తుంది. మేతలు, రొయ్యల ధరల నియంత్రణ దిశగానూ ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్వరగా రైతులకు మేలు జరిగేలా నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం.

## నాదర్‌గుల్‌లో శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్

# 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



**బాలాపూర్, జూన్ 9 (వన్ నేషన్):** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం నాదర్గుల్ గ్రీన్ హోమ్స్ కాలనీ సమీపంలోని శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్స్‌లో అకాడమీ 10వ వార్షికోత్సవ వేడుకలు మరియు నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 6న అకాడమీ చైర్మన్ వాణి, మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ అధ్యక్షత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి హాజరై నూతన అకాడమీని ప్రారంభించి రిబ్బన్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇప్పటికే పలు ప్రాంతాల్లో తన సేవలను విస్తరించింది. తాజాగా నాదర్గుల్ లో నూతన శాఖను ప్రారంభించడం విశేషం. అకాడమీలో కరాటే, డ్యాన్స్, మ్యూజిక్, ట్యూషన్స్ మరియు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించబడుతున్నాయని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్స్ కూడా ఆనివర్సిల్లో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అకాడమీ చైర్మన్ వాణి మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు కరాటే రంగానికి చెందిన నరేంద్ర, శ్రీనివాస్, సాయి కుమార్, అశోక్ చక్రవర్తి, నాదర్గుల్ ప్రాంతానికి చెందిన రాజకీయ నాయకులు యల్లల మమత సుదర్శన్ రెడ్డి, ఇంద్రసేన, కోటగిరి జంగయ్య, కుమార్ గౌడ్, నరేష్ చారి, లక్ష్మీ యాదవ్ తదితరులు పాల్గొని అకాడమీ అభివృద్ధికి శుభాకాంక్షలు తెలియజేశారు.




# ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సభ విజయవంతం చేద్దాం



**బాలాపూర్, జూన్ 9 (వన్ నేషన్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో ఫ్యూచర్ సిటీ డిపార్ట్మెంట్ అథారిటీ నూతన కార్యాలయ పనులను మరియు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన పనుల పరిశీలన కోసం విచ్చేసిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని సన్మానంతో స్వాగతించిన గుడ్ల శ్రీనివాస్ మహారాజ్, పుట్టగల జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివగల యాదయ్య తదితరులు. నేడు జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని గుడ్ల శ్రీనివాస్ తెలిపారు.

# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలుకుదాం



**బాలాపూర్, జూన్ 9 (వన్ నేషన్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం ఫ్యూచర్ సిటీలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలుకుదామని మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ తెలిపారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ స్కిల్ యూనివర్సిటీ భవనాలను బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొనాలని నాయకులకు కార్యకర్తలకు వల్లపు సుభాన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీ నల్లవెల్లి సుంకులమ్మతల్లి మహోత్సవానికి కొత్తకోట రాము, రవి ఆహ్వాన మేరకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి



**తాడిపత్రి, జూన్ 9 (వన్ నేషన్):** అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఎల్లనూరు రోడ్డు జయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న నాయి బ్రాహ్మణులు కొత్తకోట శ్రీనివాసులు తనయులు రవి ,రాము నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం లో ని శ్రీ నల్లవెల్లి సుంకులమ్మతల్లి మహోత్సవ ఆహ్వాన మేరకు హాజరైన కర్నూలు జిల్లా కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ఆంధ్రప్రదేశ్ హిందుస్థాన్ స్కౌట్స్ స్టేట్ సెక్రటరీ, మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి .మహోత్సవానికి విచ్చేసిన వారికి ఘన స్వాగతం పలికి అమ్మవారిని దర్శించుకుని వారు ఇచ్చిన విందును స్వీకరించడం జరిగినది వారితోపాటు బాణా ఉదయ సింహారెడ్డి, ఆర్.టి.ఐ జిల్లా పూర్వ ఉప అధ్యక్షులు కోడెగంటి నబి రసూల్, కేశవరెడ్డి, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వివాహానికి హాజరైన చమన్ సాబ్ తనయుడు ఉమర్ ముక్తార్



**తాడిపత్రి, జూన్ 9 (వన్ నేషన్):** అనంతపురం నూర్ భాషా ముస్లిం (దూదేకుల) సంఘం సహకార కమిటీ అధ్యక్షులు పొదరాళ్ల డి అల్లి పిర కుమారుని వివాహానికి హాజరైన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమర్ ముక్తార్, ఆర్.టి.ఐ జిల్లా పూర్వ అధ్యక్షులు కోడెగంటి నబి రసూల్ అనంతపురం పట్టణంలో కళ్యాణ్ దుర్గం రోడ్డు జొన్న ఐరన్ షాప్ వెనకాల వి కన్వెన్షన్ హాల్ లో నూర్ భాషా ముస్లిం ( దూదేకుల) సంఘం సహకార కమిటీ అధ్యక్షులు పొదరాళ్ల అల్లి పిర కుమారుని వివాహ ( షాది ) ఆహ్వానం మేరకు విచ్చేసిన అనంతపురం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమర్ ముక్తార్, ఆర్.టి.ఐ జిల్లా పూర్వ అధ్యక్షులు,ఎన్ ఎం డి.ఎస్.ఎస్ గౌరవాధ్యక్షులు కోడెగంటి నబి రసూల్, జిల్లా నాయకులు కార్యవర్గ సభ్యులు నూర్ భాషా ముస్లిం (దూదేకుల) సేవా సంఘం తాడిపత్రి అధ్యక్షులు డీకే హుస్సేన్ పీరా, గౌరవాధ్యక్షులు ఎస్ ఫక్రుద్దీన్, మస్తాన్, అబ్దుల్ ,బాబయ్య, దస్తగిరి, రజాక్ ,వన్నూరు, కమల్ భాష, రఫీ కార్యవర్గ సభ్యులు బంధుమిత్రుడు పాల్గొన్నారు.

# మేడిపల్లి మండలంలో విద్యా వ్యవస్థపై నిరసన గళం

## ప్రభుత్వ పాఠశాలల బలోపే తానికి, ప్రైవేట్ ఫీజుల నియంత్రణకు డిమాండ్




**మేడిపల్లి /జూన్ 09 /వన్ నేషన్ :** మేడిపల్లి మండలంలో ప్రభుత్వ విద్యా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొం టోందని, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ పెరిగిపోయిందని జిల్లా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారికి వారు వినతి పత్రం సమర్పించారు.

### ప్రభుత్వ పాఠశాలల దయనీయ స్థితి:

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల బోధన సక్రమంగా జరగడం లేదని నాయకులు పేర్కొన్నారు. మౌలిక వసతులైన సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మరియు సరిపడా ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలల్లో కనీస సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

### ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ:

ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, తల్లిదండ్రుల నుండి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని వారు ఆరోపించారు. పుస్తకాలు, దుస్తులు, రవాణా చార్జీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని, దీన్ని వెంటనే నియంత్రించాలని కోరారు.

### ప్రభుత్వాన్ని కోరుతున్న కీలక డిమాండ్లు:

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను ప్రభుత్వ నిబంధనల మేరకు నియంత్రించాలి. అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్, జిల్లా ఉపాధ్యాయులు హరీష్, జిల్లా నాయకులు కృష్ణ పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణలో భాగంగా, సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# పార్టీ మరినా ఎమ్మెల్యే గాంధీకి దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి

**- సీఎం సభ ఫ్లాప్ అయితే.. మా గడియారాల పంపిణీపై నెపం నెడతారా? - అధికారం ఏ పార్టీలో ఉంటే.. ఆ పార్టీకి వంగి సలాం కొట్టడం నీకు అలవాటే - గతంలో వేసిన శిలాఫలకాలు నిన్ను చూసి వెక్కిరిస్తున్నాయి -మళ్ళీ కొత్త శిలపలకలు ఎందుకు - శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ బొబ్బ నవతా రెడ్డి**



**శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 9 (వన్ నేషన్):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సభ పూర్తిగా విఫలం కావడంతో, ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తమపై అభాండాలు వేస్తున్నారని బొబ్బ నవతా రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిచి తన సత్తా నిరూపించుకోవాలని ఆమె సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి సభ వైఫల్యంపై, ఎమ్మెల్యే గాంధీ చేసిన వ్యాఖ్యలపై బొబ్బ నవతా రెడ్డి ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు.

### సీఎం సభ ఫ్లాప్ అయితే.. మాపై ఏడుపా?

ముఖ్యమంత్రి సభకు ప్రజలు రాకపోవడం, వచ్చిన వారికి కనీస సదుపాయాలు కల్పించలేకపోయిన ఎమ్మెల్యే గాంధీ.. సీఎం ముందే ప్రతిపక్షాలపై నెపం నెట్టడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని నవతా రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షం వారు ఇంటింటికీ వెళ్లి శాలువాలు కప్పి, గడియారాలు పంపిణీ చేసి మీటింగ్ కు వెళ్లొద్దని చెప్పడం వల్లే జనం రాలేదని స్వయంగా సీఎం ముందే ఎమ్మెల్యే క్షమాపణలు కోరడం సిగ్గుచేటన్నారు. గత రెండు నెలలుగా బీఆర్ఎస్ అధినాయకులు కేసీఆర్ కేటీఆర్ అన్న, హరీశ్ అన్న, కృష్ణ అన్నల ఫోటోలతో కూడిన గడియారాలను పంచుతూ.. గడప గడపకూ తిరుగుతూ ప్రజల కష్టసుఖాల్లో తాము ఉంటున్నామని, అది చూసి భరించలేక, కడుపుమంటతోనే ఎమ్మెల్యే గాంధీ ముఖ్యమంత్రి ముందు ఇంత చిల్లరగా మాట్లాడుతున్నారని ఆమె దుయ్యబట్టారు.

### అధికారం ఎవరిదైతే వారికి సలాం కొట్టే తీరు నిది

అసలు ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో, ఆయన అధినాయకుడు ఎవరో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా? అని నవతా రెడ్డి నిలదీశారు. సైకిల్ (టీడీపీ) గుర్తుపై గెలిచి కారెక్కిన గాంధీ.. మళ్లీ కారు (బీఆర్ఎస్) గుర్తుపై గెలిచి ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల చేతిలో చెయ్యి వేశారని ఎద్దేవా చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంగి సలాం కొట్టడం, ఆ ముఖ్యమంత్రిని పొగడటం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. 2018, 2023 ఎన్నికల్లో రూ. 5 వేల కోట్లు, రూ. 9 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అమెరికా తరహాలో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పిన ఆయన.. ఇప్పుడు రేవంత్ రెడ్డికి దొంగ నమస్కారాలు పెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పేరు ఎత్తే హక్కు, అర్హత గాంధీకి లేవన్నారు.

### అంకెల గారడీ.. క్రెడిట్ కొట్టేసే కుట్ర!

కేసీఆర్, కేటీఆర్ హయాంలో నగరంలో 30 నుంచి 40 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండు ఫ్లైఓవర్లు ప్రారంభించి 200 మాటలు చెబుతూ పెద్ద హంగామా చేస్తోందని విమర్శించారు. చేసేది రూ. 800 కోట్ల పనులైతే, వాటిని రూ. 2 వేల కోట్లుగా తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు. శంకుస్థాపన చేసిన రూ. 1600 కోట్ల పనుల్లో శేరిలింగంపల్లికి చెందినవి కేవలం రూ. 600 కోట్లేనని, మిగతా శంకర్‌పల్లి, ఓఆర్ఆర్, కొల్లూరు, బాచుపల్లి తదితర ప్రాంతాల పనులను కూడా ఇక్కడివే అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చందానగర్‌లో జర్నలిస్టులు, మార్వాడీలు, మైనార్టీలు, వివిధ కుల సంఘాలకు భవనాల కోసం స్థలాలు కేటాయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కానీ ఆ క్రెడిట్ రేవంత్ రెడ్డికి ఇస్తూ గాంధీ అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ఆ స్థలాల్లో భవనాలు నిర్మించి అప్పుడు గొప్పలు చెప్పుకోవాలన్నారు.

### పాత హామీలేమయ్యాయి.. శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి!

గత పదేళ్లుగా వాగ్దానాలు చేసి వదిలేసిన 700 పడకల ఆసుపత్రి, 50 ఎకరాల్లో బస్ టెర్మినల్, మియాపూర్–బీహెచ్ఈఎల్ సింగిల్ పిల్లర్ మెట్రో, చెరువుల సుందరీకరణ, 16 ఎస్టీపీ ప్లాంట్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ఏమయ్యాయని నవతా రెడ్డి ప్రశ్నించారు. ఈ హామీలన్నీ గాలికొదిలేసి.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే మళ్లీ కొత్త శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో ఎన్నికల సమయంలో ఆయన వేసిన శిలాఫలకాలే ఇప్పుడు ఆయన్ను చూసి వెక్కిరిస్తున్నాయని ఆమె ఘాటుగా విమర్శించారు.

# మహిళల రాజ్యమిది

(1వ పేజీ తరువాయి)

రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. వడ్ల కొనుగోలును మహిళా సంఘాలు విజయవంతం చేశాయని, ఇప్పుడు పంట మార్పిడిని ప్రోత్సహించే బాధ్యత కూడా మహిళలే తీసుకోవాలని పిలుపునిచ్చారు. కందులు, పప్పులు, మినుములు, ఇతర పప్పు ధాన్యాల పంటల అవసరంపై రైతు వేదికలు కేంద్రంగా రైతుల్ని చైతన్యపరచాలని కోరారు. అందుకు అవసరమైన





నిధులను మహిళా సంఘాలకు ఇస్తామన్నారు. మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద ఇవ్వాల్సిన రూ.4 వేల కోట్లను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెడితే మహిళలంతా కర్రుగాల్చి వాత పెట్టారని, దాంతో కేసీఆర్ అధికారం పోయి ఫామ్ హౌస్‌లో పడుకున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్ర మహిళలు పైసా చెల్లించాల్సిన పనిలేకుండా ప్రయాణం చేస్తుంటే కొంతమంది నేతలు విషం కక్కుతూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఉచిత బస్సులపై ధర్నా చేసే వాళ్లను అక్కలంతా జుట్టు పట్టుకొని కొట్టే పరిస్థితి వచ్చిందని, రెచ్చగొట్టిన నాయులు తేలుకుట్టిన దొంగల మంచం కింద దాచుకున్నారని విమర్శించారు. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని చెప్పారు.



- శ్రీధర్ ఫోటోగ్రాఫర్

# 2030 నాటికి 10 లక్షల మంది అభ్యాసకులకు నైపుణ్య శిక్షణ



**హైదరాబాద్, జూన్ 9 (వన్‌నేషన్):** భారత దేశంలో దశాబ్దపు ఆవిష్కరణలను వేడుక జరుపుకుంటున్న సేల్స్‌ఫోర్స్, 2030 నాటికి 10 లక్షల మంది అభ్యాస కులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి కట్టుబడి ఉంది.నంబర్ 1 ఏఐ సిఆర్ఎం అయిన సేల్స్‌ఫోర్స్, 2030 నాటికి భారతదేశవ్యాప్తంగా పది లక్షల మంది అభ్యాసకులకు ఏఐ-కేంద్రీకృత నైపుణ్యాలను అందించడానికి కట్టుబడి ఉన్నట్లు ఈరోజు వెల్లడించింది. సేల్స్‌ఫోర్స్ ఇండియా యొక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ)10 సంవత్సరాల ఆవిష్కరణ, వృద్ధిని వేడుక జరుపుకుంటున్న తరుణంలో ఈ అంశాన్ని వెల్లడించారు. పది లక్షల మంది అభ్యాసకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలనే ఈ నిబద్ధత కేవలం డిజిటల్ అక్షరాస్యతకు మాత్రమే పరిమితం కాదు, ఇది భారతదేశ శ్రామిక శక్తిని భవిష్యత్ ఉద్యోగాల కోసం సిద్ధం చేస్తుంది.

సేల్స్‌ఫోర్స్ వారి ఉచిత డిజిటల్ అభ్యాస వేదిక అయిన ట్రైల్‌హెడ్‌ను ఉపయోగించుకుంటూ, భారతదేశ భవిష్యత్తు కోసం ఏఐ-సిద్ధమైన శ్రామిక శక్తిని తీర్చిదిద్దాలనే ఉమ్మడి లక్ష్యంతో విద్యాసంస్థలు, పరిశ్రమ దిగ్గజాలు, ప్రభుత్వ సంస్థలను ఏకం చేసే సమగ్ర వ్యూహాత్మక కార్యక్రమాల ద్వారా ఈ సంకల్పం కార్యరూపం దాల్చుతోంది.

ఇండియా ఏఐ, భారత ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీటి) వంటి సంస్థల సహకారంతో ప్రభుత్వం చేపట్టిన ఏఐ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, భారతదేశపు తదుపరి తరానికి ఏఐ-సంబంధిత నైపుణ్యాలను అందించే లక్ష్యంతో వర్ధమాన ప్రతిభను మెరుగుపరచడం లక్ష్యంగా చేసుకున్నాయి.

ఏఐసీటీఈతో వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్, విద్యార్థులకు ప్రాక్టికల్ ప్రాజెక్ట్ అనుభవాన్ని అందించి, భారతదేశంలోని పట్టణాలు మరియు నగరాల్లోని విద్యార్థులకు ఉద్యోగానికి సిద్ధంగా ఉండే సేల్స్‌ఫోర్స్ మరియు ఏఐ నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో సహాయపడుతుంది. మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (హీూఎజు) వంటి సంస్థలతో సేల్స్‌ఫోర్స్ అకడమిక్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, సేల్స్‌ఫోర్స్ మరియు ఏఐ నైపు ణ్యాలకు ప్రాక్టికల్ అనుభవంతో కూడిన అవకాశాలను ప్రజాస్వామ్యీకరించడానికి ఒక ప్రయోజనాత్మక, బహుళ-అంచెల వ్యూహాన్ని అందిస్తుంది.

యాక్సెంచర్, డెలాయిట్, గ్రాంట్ థోర్న్‌టన్ భారత్, ఇన్ఫోసిస్, పీడబ్ల్యూసీ మరియు టీసీఎస్‌లతో కూడిన సేల్స్‌ఫోర్స్ భాగస్వామ్య నెట్‌వర్క్, నిర్మాణాత్మక శిక్షణా కార్యక్రమాలు, మార్గదర్శకత్వంతో కూడిన అభ్యాసం, ఉద్యోగంలో భాగంగా లభించే ప్రాజెక్ట్ అనుభవం ద్వారా ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేస్తోంది, తద్వారా సేల్స్‌ఫోర్స్ వ్యవస్థలోనే నేరుగా ఉపాధి పొందే అవకాశాలను ఇది సృష్టిస్తోంది.

సేల్స్‌ఫోర్స్, సౌత్ ఏషియా ప్రెసిడెంట్ మరియు సీఈఓ - అరుంధతి భట్టాచార్య మాట్లాడుతూ, "ట్రెండ్‌లను అనుసరించడం ద్వారా కాకుండా, వాటికి ఒక రూపాన్ని ఇవ్వడం ద్వారా ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుంది. మా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పదేళ్లు పూర్తి చేసుకుంటున్న వేళ, ఈ ప్రయాణంలో సాధించిన అత్యున్నత విజయాలు, మేము సాధికారత కల్పించిన వ్యక్తులేనని నాకు గుర్తుకొస్తోంది. 2030 నాటికి 10 లక్షల మంది అభ్యాసకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలనే మా నిబద్ధత, భారతదేశ శ్రామిక శక్తి ఏఐ ఆర్థిక వ్యవస్థకు సిద్ధంగా ఉండటమే కాకుండా, దానికి నాయకత్వం వహించడానికి కూడా సిద్ధంగా ఉందనే మా గట్టి నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. సేల్స్‌ఫోర్స్ వద్ద , ఆ సామర్థ్యం వృధా కాకుండా చూసుకోవడానికి, మరియు తదుపరి తరం టెక్నాలజీ నాయకులు ఇక్కడి నుంచే ఉద్భవించేలా చూడటానికి మేము కట్టుబడి ఉన్నాము" అని అన్నారు.

విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ ముఖ్య సమన్వయ అధికారి బుద్ధా చంద్రశేఖర్ మాట్లాడుతూ, "భవిష్యత్తులో పని స్వభావానికి అనుగుణంగా మన విద్యార్థులను మరియు శ్రామిక శక్తిని మనం ఎంత సమర్థవంతంగా సిద్ధం చేస్తామనే దానిపైనే, ప్రపంచ స్థాయి డిజిటల్ మరియు ఏఐ శక్తి కేంద్రంగా భారత్ ఎదగడం ఆధారపడి ఉంటుంది. తరగతి గదిలో అభ్యసన మరియు వాస్తవ ప్రపంచ ఆవిష్కరణల మధ్య అంతరాన్ని తగ్గించడంలో పరిశ్రమ-విద్యాసంస్థల సహకారం కీలక పాత్ర పోషిస్తుంది. సేల్స్‌ఫోర్స్‌తో మా భాగస్వామ్యం, డిజిటల్, క్లౌడ్, డేటా మరియు ఏఐ సామర్థ్యాలతో కూడిన, పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ప్రతిభావంతుల సమూహాన్ని నిర్మించాలనే మా ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పాఠ్యప్రణాళిక ఏకీకరణ, అధ్యాపకుల సాధికారత , వర్చువల్ ఇంటర్న్‌షిప్‌ల వంటి కార్యక్రమాలు, భారతదేశం యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఆర్థిక వ్యవస్థలో విద్యార్థులు పాల్గొనడానికి అర్థవంతమైన మార్గాలను సృష్టించడంలో సహాయపడుతున్నాయి" అని అన్నారు.

## పుష్కర ప్రధాని

(1వ పేజీ తరువాయి)

సమీక్షిస్తారు. రాజకీయంగా ఇది కీలక సమావేశం కానుందని విశ్లేషకులు అంటున్నారు. ఎన్‌డీఏ భేటీ తర్వాత ప్రధాని నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. కాగా.. కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ, బీజేపీలో సంస్థాగత మార్పులు త్వరలోనే జరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ఎన్‌డీఏ, నీతి ఆయోగ్ సమావేశాలు ముగిసినా ఢిల్లీలోనే ఉండాలని కేంద్ర మంత్రులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది.

### 12 ఏళ్లలో సాధించిన విజయాలివీ - ఎక్స్‌లో మోదీ సుదీర్ఘ పోస్టు

12 ఏళ్లలో తన ప్రభుత్వ విజయాలు, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సాధికారత, మౌలిక వసతుల కల్పన, మధ్యతరగతికి పన్ను మినహాయింపుల గురించి మంగళవారం ప్రధాని 'ఎక్స్'లో వివరించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలచాలన్న లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా.. 'సేవ.. సత్పరిపాలన.. పురోగమనం'పై ప్రత్యేక దృష్టితో తమ ప్రయాణం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ మధ్య సమతుల్యం సాధిస్తూ సాగుతున్నామన్నారు. ప్రధానంగా వివిధ సంక్షేమ పథకాల కింద 81 కోట్ల మంది ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద పేదలకు 4 కోట్లకుపైగా ఇళ్లు నిర్మించామన్నారు. ఉజ్వల పథకం కింద 10.5 కోట్ల మందికి వంటగ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని.. దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించామని తెలిపారు. ఇంకా ఏం చెప్పారంటే.. పీఎం-కిసాన్ స్కీం కింద అన్నదాతల ఖాతాల్లోకి నేరుగా రూ.4.3 లక్షల కోట్లకుపైగా బదిలీచేశాం. పంటల బీమా కింద 4 కోట్ల మందికి రూ.2 లక్షల కోట్లు చెల్లించాం. కనీస మద్దతు ధర కింద రూ.26 లక్షల కోట్ల విలువైన పంటల ఉత్పత్తులను సేకరించాం. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీం కింద 8 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తున్నాం.

# కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజీలు, గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి




**ఎమ్మిగనూరు, జూన్ 9 (వన్‌నేషన్):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజీలు, గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం నాడు ఎమ్మిగనూరులో సోమప్ప సర్కిల్ నందు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు గోవిందు, రంగన్న, ప్రసాదు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై రోజురోజుకు భారాలు పెంచుతున్నాయని విమర్శించారు. ఇటీవల గత 15 తేదీ నుండి నాలుగుసార్లు పెట్రోలు, డీజీలు, రెండుసార్లు గ్యాస్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ, ట్రంప్ మిత్రులు ఒక్కటై మన దేశ ప్రజలపై రోజురోజుకు విపరీతంగా ట్రంప్ పన్నులు వేస్తున్నా, మోడీ కిమ్మనకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. మన దేశానికి గతంలో క్రూడ్ ఆయిల్ రష్యా, వెనిజులా, ఇరాన్ నుండి సప్లై చేసేవారని తెలిపారు. కానీ ప్రస్తుతం అమెరికా నుండి అధిక ధరలకు క్రూడ్ ఆయిల్ కొనడం వల్ల ఆ భారం ప్రజలపై వేయడం అన్యాయమని అన్నారు. అందుకే పెట్రోల్ ధర లీటర్కు 118 రూపాయలు, గ్యాస్ ధర సిలిండర్ కు 1000 రూపాయలు పెరిగాయని తెలిపారు. ఇటీవల 9 వామపక్ష పార్టీల నాయకులు కృష్ణ, గోదావరి బేసిన్ దగ్గర ఉన్న గ్యాస్ రిఫైనరీని సందర్శించారని తెలిపారు. కృష్ణ గోదావరి గ్యాస్ బేసిన్ లో ఆంధ్రప్రదేశ్ కు 50 శాతం గ్యాస్ సరాపరా చేయాలని వారు డిమాండ్ చేశారని తెలిపారు. ఈ గ్యాస్ వల్ల ప్రజలకు కేవలం 200 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇవ్వవచ్చునని తెలిపారు. కేజీ బేసిన్ గ్యాస్ ను రిలయన్స్ కంపెనీకి అప్పజెప్పడం మూలంగానే ప్రజలు వేయి రూపాయలు సిలిండర్ గ్యాస్ కొనడం జరుగుతుందని తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా ఉందని ఆరోపించారు. ప్రజలపై భారాలు మోపుతూ బడా కార్పొరేటర్లకు రాయితీలు కల్పించడం ఏమి న్యాయమని ప్రశ్నించారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నిరసనను ఎదుర్కొనక ముందే పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాముడు, లక్ష్మీ నరసయ్య, సురేష్, కృష్ణ, రమేష్, శ్రీనివాసులు, అబ్దుల్లా, రాజా రమేష్, సిపిఐ నాయకులు రాజీవ్, తిమ్మ గురుడు, విజయేంద్ర, వెంకటేశ్వర్లు, దాదావలి, బజారి, మల్లికార్జున గౌడ్, నరసింహులు, సిపిఐ (ఎంఎల్) నాయకులు హనీఫ్, ఏసేపు, జయన్న, కాజా, కిరణ్, పక్కిరి సాబ్ పాల్గొన్నారు.

# ప్రజలను గాలికి వదిలేసిన రేవంత్ సర్కార్

**- రాజకీయ పునరావాస నామినేటెడ్ పదవుల జి ఓ ను రద్దు చేయాలి -**

**సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి - బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్**



**హైదరాబాద్, జూన్ 9 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్రం లో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బిజెపి రాష్ట్రనేత కొలను వెంకటరెడ్డి విమర్శించారు. ప్రజలను పట్టించుకోకపోవడం ,ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వల్ల వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ జడ్పిటిసి సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై పట్టు కోల్పోయాడని, దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలు అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, కేంద్రాన్ని విమర్శించడం తప్ప పరిపాలనను గాలికి వదిలేసాడని విమర్శించారు. ఎంపీటీసీ సింగిల్ విండో ఎన్నికలు జరపకపోగా వాటికి నామినేటెడ్ పెదవులలో పార్టీ శ్రేణులు నియమించి మూలంగా రైతులకు రావలసిన సౌకర్యాలు అనడం లేదని ,పాలన వ్యవస్థ లేకపోవడం మూలంగా సహకార వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన విమర్శించారు అంతేకాకుండా నేడు రాష్ట్రంలో యువతీ యువకులు రైతులు,విద్యార్థులు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతో ఉన్నారన్నది స్పష్టమవుతుంది అన్నారు .రైతు భరోసా కు తూట్లు పొడిచి రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసారని ఆయన దుయ్యబట్టారు.

ప్రజల సంక్షేమం గాలికి వదిలేసి కాంగ్రెస్ శ్రేణులకు రాజకీయ పునరవాసము కల్పించడం కోసం కుట్రలు చెస్తుందని ఆరోపించారు. వెంటనే రైతు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, కాంగ్రెస్ శ్రేణుల రాజకీయ పునరావాస నామినేటెడ్ పదవుల జి ఓ ను రద్దు చేయాలని కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు....

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**